క్లుప్తంగా

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు



తాళ్లరేవులో దేవతా విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

తాళ్లరేవు: తాళ్లరేవు పంచాయతీ పరిధిలోని రంగనాయకపురంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వేద పండితులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వచ్చే నెల 1వ తేదీన ఉదయం 7.30 గంటలకు సీతా పరివార సమేత రామచంద్రమూర్తి, గణపతి, సరస్వతీ దేవి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా విగ్రహ మూర్తులను గ్రామాల్లో ఊరేగిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సత్తెమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే పొన్నాడ



గున్నేపల్లి సత్తెమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మ తల్లి అమ్మవారిని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే పొన్నాడకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, నడింపల్లి సూరిబాబు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, కోలా బాబ్జీ తదితరులున్నారు.

నాగేంద్రకు సత్కారం

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన అమలాపురానికి చెందిన మట్టపర్తి నాగేంద్రను పార్టీకి చెందిన పలువురు నాయకులు స్థానిక హైస్కూలు సెంటరులో ఆదివారం సత్కరించి అభినందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, ఎమ్మెల్సీ అభ్యర్థి కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ, పార్టీ నాయకులు రెడ్డి సత్యనారాయణ, కముజు రమణ, చిక్కాల రవిశంకర్ తదితరులు నాగేంద్రను అభినందించిన వారిలో ఉన్నారు.

వైఎస్సార్ సీపీ టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా యల్లమిల్లి



యల్లమిల్లిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ టీయూసీ అధ్యక్షుడిగా ముమ్మిడివరం మండల ఆటో అండ్ గూడ్స్ యూనియన్ అధ్యక్షుడు యల్లమిల్లి వెంకటేశ్వరరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. తనకు పదవి రావడానికి సహకరించిన మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ, పెన్మత్స చిట్టిరాజు, బొంతు సత్యశ్రీనివాస్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ దుశ్శాలువాతో సత్కరించారు.

శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే సత్కారం

అమలాపురం రూరల్: బండారులంకకు చెందిన వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కాలెపు నాగ శ్రీనివాసరావును ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఎమ్మెల్యే పొన్నాడను శ్రీనివాసరావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

నేతలకు కృతజ్ఞతలు



మంత్రి విశ్వరూప్‌ను కలిసిన కాశి వెంకటరమణ తదితరులు

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కాశి వెంకట రమణ ఆదివారం మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాల మునికుమారిలను మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు పదవి రావడానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన వెంట కాశి జగపతి, రామకృష్ణ, కర్నీడి రాధాకృష్ణ, బొంతు సత్యశ్రీనివాస్ తదితరులున్నారు.

ఆదివారం అమలాపురంలో సెలవు

- వ్యాపార సంఘాల నిర్ణయం
- మంగళవారం సెలవుకు స్వస్తి

అమలాపురం టౌన్: దాదాపుగా 1940వ దశకం నుంచి అమలాపురం పట్టణంలో మంగళవారం రోజు మార్కెట్ సెలవు అమలవుతోంది. అయితే ఇప్పుడు మారిన మార్కెట్ పరిస్థితులు, వ్యాపారుల సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని మెజారిటీ వ్యాపార సంఘాలు మంగళవారం సెలవు స్థానే ఆదివారం సెలవును స్వాగతిస్తున్నాయి. ఇక నుంచి ఆదివారం రోజునే సెలవు తీసుకోవాలని నిర్ణయించాయి.

ఒకప్పటి డివిజన్ కేంద్రం, ప్రస్తుతం జిల్లా కేంద్రమైన అమలాపురంలో అనేక కొనుగోళ్ల అవసరాల నిమిత్తం కోనసీమ వ్యాప్తంగా ప్రజలకు అనుబంధముంది. అమలాపురంలో మంగళవారం సెలవు దినంగా ప్రజల్లో నాటుకుపోయింది. అమలాపురంలోని రెండు చాంబర్ ఆఫ్ కామర్స్ పరిధిలో 32 రకాల వ్యాపార సంఘాలు(ట్రేడ్ యూనియన్లు) ఉన్నాయి. ఈ సంఘాల ద్వారా పట్టణంలో సుమారు 900 వ్యాపార దుకాణాలు ఉన్నాయి. ఈ 32 సంఘాల్లో రెండు వ్యాపార సంఘాలు మినహా మిగిలిన సంఘాలకు చెందిన వ్యాపారులు ఆదివారం సెలవు దినానికే మద్దతు పలుకుతున్నారు. దీంతో ఆదివారం సెలవు దినాన్ని మార్చి నెల నుంచి పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ఆ వ్యాపార సంఘాలు సంసిద్ధమవుతున్నాయి. ఇప్పటికే పట్టణంలోని ఐరన్, సిమెంట్, పెయింట్స్, హార్డ్‌వేర్ దుకాణాల వ్యాపార సంఘాలు మంగళవారం సెలవుకు స్వస్తి చెప్పి ఆదివారం సెలవును అమలు చేసుకుంటున్నాయి.



అమలాపురం కలశం సెంటరు

అసలు మంగళవారం సెలవు ఎందుకొచ్చింది..?

బ్రిటిష్ ఇండియా పాలనలో దాదాపుగా భారత దేశంలోని ప్రధాన పట్టణాలు, వ్యాపార కూడళ్లలో ఆదివారమే సెలవు దినంగా ఉండేది. అయితే అమలాపురంలో మాత్రం మంగళవారం సెలవుగా నిర్ణయించుకోవడానికి ప్రత్యేక కారణముంది. అప్పట్లో అమలాపురంలోని దుకాణాలకు అవసరమైన సరకులను రాజమహేంద్రవరం వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చేది. పైగా గోదావరి నదులపై వంతెనల సౌకర్యం లేక జలమార్గంలో ప్రధాన పంట కాలువల ద్వారా లాంచీలు, పడవలపై సరుకుల రవాణా జరిగేది. ఆదివారం రాజమహేంద్రవరం వెళితే అక్కడ సెలవు.. అందుకే ఇక్కడి వ్యాపారులు అమలాపురంలో మంగళవారం సెలవుగా ప్రకటించుకుని ఆ రోజు దుకాణాలు మూసేసి రాజమహేంద్రవరానికి సరుకుల ఖరీదుకు వెళ్లేవారు. అలా మంగళవారం సెలవు ఆనవాయితీగా మారిపోయింది.

మార్పుకు ఇదీ కారణం

ప్రస్తుతం సరకుల ఖరీదు కోసం స్థానిక వ్యాపారులు ఒక్క రాజమహేంద్రవరంపైనే ఆధారపడలేదు. పైగా అందుబాటులో ఉన్న సాంకేతికతతో సరకుల ఖరీదుకి నేరుగా వెళ్లాల్సిన పని ఉండటం లేదు. దేశంలో ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్ కొనుగోళ్ల ద్వారా పార్శిల్ వ్యాన్‌లు నేరుగా దుకాణం దగ్గరకే వచ్చి దిగుమతి చేసి వెళుతున్నాయి. దీంతో మంగళవారం సెలవు వల్ల పూర్వం మాదిరిగా కలిసొచ్చేది ఏదీ లేదు. ఆదివారం సెలవుతో కుటుంబంతో సంతోషంగా గడిపేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ఓ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆదివారం సెలవును ఇక నుంచి అమలు చేయాలని నిర్ణయం తీసుకుంటే, మరో చాంబర్ ఆయా వ్యాపారుల వెసులుబాటును బట్టి ఆదివారం సెలవు తీసుకునే స్వేచ్ఛను అదే వ్యాపారులకు వదిలేసింది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అల్లవరం: కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో 1979–80 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు అదే పాఠశాల ఆవరణలో ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకున్నారు. పాఠశాల వేదికగా అప్పటి మధుర స్మృతులను గుర్తు చేసుకుని ఒకరినొకరు పలకరించుకున్నారు. తొలుత తమ విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ఆకుల వీరాంజనేయులు, కోరుమల్లి సత్యనారాయణాచార్యులు, పోరంకి లక్ష్మీప్రసాద్, మంగళంపల్లి అప్పలనరసింహం, ముత్యాల స్వామినాయుడు, గుర్లింక సత్యనారాయణలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మంగళంపల్లి సత్యనారాయణమూర్తి, పూర్వ విద్యార్థులు సాధనాల శ్రీనివాసరావు, మెట్ల సుబ్రహ్మణ్యం, సూర్యకళ, మల్లాడి భాను, అప్పారి త్రిమూర్తులు, పరమట కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.



1979-80 బ్యాచ్‌కి పదో తరగతి విద్యార్థులు



గొప్ప మధురానుభూతి

ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడినా స్నేహితుల్ని కలుసుకోవడం కోసం వచ్చాను. 43 ఏళ్ల తర్వాత ఒకే చోట ఇంత మంది స్నేహితుల్ని కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. నా జీవితంలో మరిచిపోలేని రోజు ఇది.

– సాధనాల శ్రీనివాసరావు, చీఫ్ ఇంజనీర్, టాటాప్రాజెక్టు, హైదరాబాద్



చాలా సంతోషంగా ఉంది

ఆత్మీయ సమ్మేళనం ద్వారా అప్పటి గురువులు, స్నేహితుల్ని కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ రోజు మిగిల్చిన మధుర జ్ఞాపకాలను జీవితాంతం నా మదిలో పదిలంగా ఉంచుకుంటాను.

– మెట్ల సుబ్రహ్మణ్యం, కొమరగిరిపట్నం

ఎమ్మెల్సీ అభ్యర్థులకు సత్కారం

ఐ.పోలవరం: నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్‌లతో పాటు అమలాపురం పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలిగా మరోసారి నియమితులైన కాశి మునికుమారిని మండల వైఎస్సార్ సీపీ నాయకులు కలసి అభినందనలు తెలిపారు. జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజులు వారిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి దుశ్శాలువాతో సత్కరించారు.

600 జ్యూట్ బ్యాగ్‌ల పంపిణీకి ఏర్పాట్లు

అమలాపురం టౌన్: అంతర్వేదిలో ఉన్న దేవతిలకుల అన్నదాన సత్రం ఏర్పాటై వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా మార్చి 4వ తేదీన జరిగే శత వార్షికోత్సవాల్లో సంఘీయులకు 600 జ్యూట్ బ్యాగ్‌లు పంపిణీ చేయనున్నట్లు దాతలు అడ్డా కాశీ విశ్వేశ్వరరావు, లక్ష్మీ వెంకట సత్యవతి దంపతులు తెలిపారు. అమలాపురంలో వారిద్దరు ఆదివారం సంఘీయులను కలిసి శత వార్షికోత్సవాల ఆహ్వాన పత్రాలు అందించి ఆహ్వానించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఇజ్రాయిల్‌కు శుభాకాంక్షలు

తాళ్లరేవు: ఎమ్మెల్సీ అభ్యర్థి బొమ్మి ఇజ్రాయిల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు, వ్యవసాయ శాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ పెట్ల సూర్యనారాయణ రాజు తెలిపారు. ఆదివారం ఇజ్రాయిల్ స్వగృహంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపామన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్లలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ముమ్మిడివరం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పెట్ల శాంతకుమారి, జార్జిపేట ఎంఎల్‌కే నగర్ నాయకులు శీలి రాజు, వినోద్ కుమార్ తదితరులున్నారు.

అల్లవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థిగా నియమితులైన బొమ్మి ఇజ్రాయిల్‌ని గోడిలోని ఆయన నివాసంలో బాబు జగ్జీవన్‌రామ్ సొసైటీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు వంటెద్దు వెంకయ్యనాయుడు, తిక్కా తదితరులు ఇజ్రాయిల్‌ని కలసి శుభాకాంక్షలు తెలిపారు.



బొమ్మి ఇజ్రాయిల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సూర్యనారాయణరాజు తదితరులు

పోలీసుల స్నేహపూరిత క్రికెట్ మ్యాచ్

యానాం: యానాం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గూటం శివగణేష్ ఉద్యోగ విరమణ చేస్తున్న నేపథ్యంలో ఆయన గౌరవార్థం ఆదివారం స్థానిక మెట్టకూరు హైస్కూల్‌లో పోలీసులు స్నేహపూరిత క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు జట్ల మధ్య మ్యాచ్‌లు హోరాహోరీగా జరిగాయి. ఈ మ్యాచ్ చూసేందుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రీజనల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసు అధికారిగా అంకితభావంతో శివగణేష్ చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న సీఐ గూటం శివగణేష్‌ను సత్కరించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు.



క్రికెట్ మ్యాచ్‌కు హాజరైన ఆర్‌ఏఓ మునిస్వామి, సీఐ శివగణేష్

కుడుపూడికి అభినందనలు

అమలాపురం టౌన్: ఎమ్మెల్సీ అభ్యర్థి, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావును పలువురు ప్రజాప్రతినిధులు, పలు సంఘాల ప్రతినిధులు ఆదివారం వేర్వేరుగా సత్కరించి అభినందించారు. సూర్య వాకర్స్, కేజీకే జిమ్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్, ఫుట్‌బాల్ అసోసియేషన్, కోనసీమ రైల్వే సాధన సమితితో పాటు పలు సంస్థలు ప్రతినిధులు కుడుపూడిని స్థానిక హైస్కూలు సెంటరులో వేర్వేరుగా సత్కరించారు. రైల్వే సాధన సమితి కన్వీనర్ డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్‌లు ఆయనను సత్కరించారు.



సూర్యనారాయణరావును సత్కరిస్తున్న పలు సంస్థల ప్రతినిధులు

వైభవంగా సూర్య వాహనోత్సవం

యానాం: యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సూర్యవాహనోత్సవం వైభవంగా నిర్వహించారు. కామిశెట్టి వేణుగోపాలరావునాయుడు కుమారులు ఉత్సవదారులుగా నిర్వహించిన సూర్యవాహనోత్సవానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, కల్యాణోత్సవ కమిటీ సభ్యులు ఆర్‌ఏఓ మునిస్వామి, డీటీ సత్యనారాయణ తదితరులు హాజరై స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామివారి రథయాత్ర మార్చి 6న నిర్వహించనున్న నేపథ్యంలో స్థానిక కొత్తబస్టాండ్ ఆవరణలో ప్రత్యేక షెల్టర్‌లో ఉంచిన స్వామివారి రథాన్ని ఆదివారం ఉదయం స్థానిక వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో చిన్నాసెంటర్‌కు తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ శేరు నూకరాజు, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ పాల్గొన్నారు.



సూర్యవాహనోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు

పూడికతీత పనులపై ఫిర్యాదు

యానాం: దరియాలతిప్ప రక్షిత మంచినీటి చెరువు పూడికతీత పనులు నిబంధనల ప్రకారం చేయాలని కోరుతూ స్థానిక గ్రామస్తులు ఆదివారం అధికారులకు ఫిర్యాదు చేశారు. సుమారు ఆరు గ్రామాలకు రక్షిత మంచినీరు అందించే దరియాలతిప్ప మంచినీటి చెరువులో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆదేశాలతో పీడబ్ల్యూడీ యంత్రాంగం పూడికతీతకు టెండర్లు పిలిచింది. చెరువులో అడుగున్నర లోతు మట్టిని తొలగించి దాన్ని చెరువు చుట్టూ గట్టును పటిష్టపరచాలని టెండర్‌లో ఉన్నా కాంట్రాక్టర్ నిబంధనలు పాటించడం లేదు. దీనిపై గ్రామస్తులు సబ్బతి లోకేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామిలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు పెంకేవారిపేటలో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పెంకేవారిపేటలోని ఒక గృహంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఐలాండ్-5లో ఎమ్మెల్యే అశోక్ ఆకస్మిక పర్యటన



ఐలాండ్ నెంబరు-5లో ఆకస్మిక పర్యటన చేసిన ఎమ్మెల్యే అశోక్

యానాం: గౌతమీగోదావరి మధ్యలో సహజసిద్ధంగా ఏర్పడిన ఐలాండ్ నెంబరు-5లో రూ.5 కోట్ల పర్యాటక శాఖ నిధులతో చేపట్టిన నిర్మాణాలను పరిశీలించేందుకు ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్ ఆదివారం అక్కడకు వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ నిబంధనలకు విరుద్ధంగా సింగం అనే జూదం ఆట ఆడుతున్న సుమారు 40 మందిని చూసి ఆశ్చర్యపోయారు. ఎమ్మెల్యేను చూసి జూదగాళ్లంతా అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని ఆపి అసలు ఐలాండ్-5 లోకి ఎలా వస్తున్నారని ఎమ్మెల్యే అశోక్ వారిని ప్రశ్నించారు. బోట్లలో ఆటగాళ్లను తరలిస్తారని, రోజూ లక్షలాది రూపాయల మేర బెట్టింగ్‌తో జూదం జరుగుతున్నట్లు వారంతా బదులిచ్చారు. అనంతరం ఎస్ఐ నూకరాజుకు ఎమ్మెల్యే అశోక్ ఫోన్ ద్వారా విషయం తెలియజేయడంతో ఆయన అక్కడకి చేరుకున్నారు. ఐలాండ్-5లో జరుగుతున్న జూదంపై నిఘా పెట్టాలని ఎమ్మెల్యే అశోక్ ఎస్ఐను ఆదేశించారు.

పంట కాలువలోనే ట్రాక్టర్

తాళ్లరేవు: పంట కాలువలోకి బోల్తాపడిన ట్రాక్టర్‌ను తొలగించకపోవడంతో వరి చేలకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు. యానాం-కోటిపల్లి ఏటిగట్టు రహదారిలో గోవలంక వద్ద ఇటుకల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ శనివారం పంట కాలువలోకి బోల్తా పడిన విషయం తెలిసిందే. అయితే ట్రాక్టర్‌తో పాటు ఇటుకలన్నీ పంటకాలువలో పడడంతో నీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తాయి. వారం రోజుల తరువాత ప్రస్తుతం తమ ప్రాంతానికి వంతు ఇచ్చారని, అయితే ట్రాక్టర్ కారణంగా పంట కాలువ మూసుకుపోవడంతో నీటి ప్రవాహం నిలిచిపోయిందని అరటికాయలంక, యానాం ప్రాంతాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ట్రాక్టర్‌ను తొలగించి సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

పేదలకు దుస్తులు, పండ్ల పంపిణీ



వృద్ధులకు వితరణ చేస్తున్న మంత్రి సతీమణి మీనాక్షి

అమలాపురం రూరల్: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు కృష్ణారెడ్డి పుట్టినరోజు వేడుకల సందర్భంగా నియోజకవర్గంలోని వివిధచోట్ల వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. అమలాపురం లూయి అంధుల పాఠశాల చిన్నారులకు, కామనగరువు కరక్కయ్యపేట వృద్ధాశ్రమంలో వృద్ధులకు, ఈదరపల్లి హరిమనో వికాస కేంద్రంలో వికలాంగులకు మీనాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంత్రి సతీమణి బేబీ మీనాక్షి దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. కామాక్షి పీఠంలో అనాథలకు భోజనాలు ఏర్పాటు చేశారు. టీబీ రోగులకు ప్రోటీన్ ఫుడ్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

80 మంది యువకుల రక్తదానం



రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రముఖులు

అమలాపురం టౌన్: లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక కర్రి సత్యనారాయణ మిల్లు ప్రాంగణంలో రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొలిశెట్టి తాతాజీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరంలో 80 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అమలాపురం బుద్దాల నాగరత్నం బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబు తదితరులు రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



విలసవిల్లిలో వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేస్తున్న సతీష్

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి పంచాయతీ పరిధి గోకనవిల్లి గ్రామానికి చెందిన జొన్నాడ రామకృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి భార్య విదేశాల్లో ఉండటంతో మృతుని చెల్లెలు దుర్గాభవానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా సర్పంచ్ ఊర్మిళాదేవి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ రూ.10 వేల రూపాయలను ఆదివారం అందజేశారు. మిగతా సొమ్ము నేరుగా బ్యాంకు ఖాతాలో జమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వీపీ డి.లావణ్య, చేట్ల సోమేశ్వరి, నేదునూరి సతీష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికపై హర్షం

తాళ్లరేవు: కాకినాడ జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా పిఠాపురం మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ వర్ధినీడి సుజాతను ప్రకటించడంపై తాళ్లరేవు సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, మోకా విష్ణుప్రసాద్, కాశి రవిబాబు తదితరులు ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ముమ్మిడివరం: లంకాఫ్ ఠానేల్లంకలో పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. అమలాపురం ఏఎస్ఏ హాస్పటల్ ప్రతినిధులు నిర్వహించిన ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కొప్పిశెట్టి కృష్ణమూర్తి ప్రారంభించారు. మెగా వైద్య శిబిరంలో కంటి వైద్యం, స్త్రీల సంబంధిత వ్యాధులు, దగ్గు, ఆయాసం, కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్ వంటి వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కర్నీడి వెంకటేశ్వరరావు, వైద్యులు ఎం.శివ, ఆశిష్, అంజలి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

మల్లాడిని కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి కోలా

యానాం: మత్స్యకార సామాజికవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి కోలా గురువు ఆదివారం రాత్రి మాజీమంత్రి, టీటీడీ సభ్యుడు మల్లాడి కృష్ణారావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ సైతం ఆయన వెంట ఉన్నారు. మల్లాడి, సుభాష్‌చంద్రబోస్‌లు ఎమ్మెల్సీ అభ్యర్థి కోలా గురువును సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ నాయకులు విశ్వనాథపల్లి నాగసుందరం, బచ్చర త్రిమూర్తులు, హరి, జగ్గబాబు పాల్గొన్నారు.

అన్న సమారాధన

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వర స్వామి, భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలు పురస్కరించుకుని భారీ అన్నసమారాధన జరిగింది. సుమారు 5 వేల మంది భక్తులకు ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు.

హేతువాదం జీవన విధానంగా మారాలి

యానాం: హేతువాదం ఒక జీవన విధానంగా మారితే తప్ప సమాజంలో వేళ్లూనికుని ఉన్న మత, కుల, మూఢ విశ్వాసాలు అంతరించవని ఏపీ హేతువాద సంఘ అధ్యక్షుడు నార్ని వెంకటసుబ్బయ్య అన్నారు. ఆదివారం స్థానిక మీరా టూరిస్ట్‌హోమ్‌లో జనమిత్ర వారపత్రిక సంపాదకులు పొనుగుమట్ల విష్ణుమూర్తి అధ్యక్షతన హేతువాదం పుస్తకావిష్కరణ జరిగింది. ఇదే వేదికపై అజాజ్ రాసిన అల్లూరి సత్యనారాయణరాజు జీవిత చరిత్రను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీ కృష్ణయ్య, గ్రంధి నాగేశ్వరరరావు, డాక్టర్ అన్యం రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.